

# విచిత్రాల్లో విచిత్రం!
# నోరు లేని విలేఖరి

విలేఖరి, పత్రికా కార్యాలయాల్లో పేరూ జీతం పదవి లేని ఒకడు. 'నస్వరంతో' గాడు కాదు కానీ, వట్టి 'స్వరంతో'. చెప్పేదుమాటలుతప్ప మరేమీ వినడు! అలాంటిది ఉద్యోగం నాకెందో నాకు తెలియదు, ఈనాటికీ. అను భవంలోనూ నాకు విప్పి చెప్పింది ఏమీ లేదు.

నా విలేఖరిత్వానికి ప్రారంభోత్సవం ఒక ఆంగ్ల వారపత్రిక ప్రారంభోత్సవాన్ని 'విలే ఖరించడం'తో ప్రారంభమయింది. తీరా ఆ వారపత్రిక ద్వితీయసంచిక రాలేదు! నాకు ప్రాణం చిక్కుకున్నట్టే — నాతో పాటు జీవితం ప్రారంభమయినదానికి ద్వితీయ విఘ్నం సంభవించిందిగదా అని. ఆ సంపాద కుణ్ణి అడిగాను "ఏమండీ మీపత్రిక ద్వితీయ సంచిక రాలేదే?" అని చాలా ఆదుర్దాతో. ఆయన "అసలు మొదటిసంచికే రానిదే!" అన్నాడు. "అయ్యో! మొన్న ప్రారంభోత్సవానికి నేను వచ్చాను. మీరు పత్రికలను పంచిపెట్టారుగదాను!" అని గుర్తుచేశా. ఆయన నా తెలివితక్కువతనానికి ఒక ముసాలా నవ్వునవ్వి "సరి! అది ప్రారంభోత్సవ సంచికోయ్! వస్తుంది మొదటి సంచిక త్వరలోనే" అన్నాడు.

నేను చాలా దిగులుపడ్డాను. పడక్కయింది. ఆ దిగులు వదలలేదు. ఆ పత్రిక మొదటి సంచిక ఇంతవరకూ రాలేదు. నా ఉద్యోగం ప్రతిరోజూ ప్రారంభోత్సవం తంతుగానే ఉంది — నేను ఎదగలేదు! పైగా ఆ ఆంగ్ల వారపత్రిక ప్రారంభోత్సవ వ్యవహారం తల్చుకుంటుంటే, మరింత దిగులు కలుగుతూ ఉంటుంది.

ఆ పత్రికను భారతమహాజనాలకు విజ్ఞానం కలిగించడానికి ఒక 'జనరలిస్టు' పెట్టాడు. ఒక పెద్ద రాజకీయవాదిచేత ప్రారంభోత్సవం చేయించాడు. ఆ రాజకీయవాది పెద్దల్లో పైకి వచ్చినవాడు కానీ, యువకుల్లో కాదు. ఆయనకు రాజకీయాలుతప్ప విజ్ఞానం వేరే ఉన్నట్టువాడు తెలియదు. ఆయన ఇలా ఉపన్యసించాడు:

"సోదర సోదరీమణులారా! — సోదరీ మణులు లేరు కామాల్లు! — (నవ్వులు) ఊఁ! ఉండరులే! సోదరులారా! పూర్వం — ఋషులూ — అంటే మునులూ, పురాణాలూ పద్యాలూ రాశారు — వాళ్ళకి కవనం వచ్చుకాబట్టి. వాల్మీకి — రామాయణం రాశాడు. మీకు తెలుసు. భారతం — రాశాడు — మరొకడు! మన మిత్రుడూ — ఇవాళ — ఇక్కడ ఒక పత్రిక పెడుతున్నాడు — మంచివాడు — పైకి రావలసినవాడు — (చప్పట్లు) — నేనూ చెప్పాను — మంచిపని అని —" ఇలా రాత్రి పదిన్నర దాకా ఉపన్యాసం చెప్పాడు. ఆ రాత్రి ఇంటికిపోవడానికి బస్సు దొరక లేదు — ఏ హోటల్లోనూ నాకు అన్నం లేదు. దేవుడా అంటూ నాలుగుమైళ్ళు నడుచుకుంటూ ఇంటికిపోయాను.

ఇన్ని జరిగినా, నా ఉద్యోగ ప్రారంభోత్సవానికి దుశ్శకునం కలిగిందనుకోలేదు. కానీ, రెండో సంచిక రాలేదే అనే బాధుర్గ.

కొందరు మిత్రులు చెప్పారూ — 'ఆ ప్రారంభోత్సవంలో కనపడ్డ విజ్ఞానాన్ని దాటిపోవు నీ జీవితంలో' అని. అదీ ఒక దిగులేగానీ, అసలు ఉద్యోగం ఉంటే వెధవ విజ్ఞానం ఎందుకులే అనే ధైర్యం ఉంది. ఉద్యోగంకానీ ఉండవలసింది, విజ్ఞానమా! నేను ప్రపంచాన్ని ఉద్ధరిస్తానా పాడా! ఏదో — ఉద్యోగం పురుషలక్షణమన్నారు. ఉద్యోగంకోసం పట్నంవచ్చి అమాంబాపతు పోస్టు వెదికాను.

నాకు ప్రాప్తముంటే ఉద్యోగమే వస్తుందని జ్యోతిష్కులు చెప్పారు. అంటే ప్లీడరు గుమాస్తాగానీ, షావుకారు గుమాస్తాగానీ, రిజిస్ట్రారు ఆఫీసు గుమాస్తాగానీ కావచ్చు. మహా గ్రంథరచయితను కావచ్చు. వ్రాతలు కోతలు లేని ఉద్యోగం ఏముంటుంది గనక — ఒక్క రాజకీయవాదికి మాత్రం వ్రాతలు కొత్తలోపం.

కానీ సొంతంగా వ్రాస్తానేమో అను కున్నాను — చెప్పేదు మాటలు వ్రాస్తానని ఏనాడూ అనుకోలేదు. నా వ్రాతచూసి ఏ షావుకారూ నేను పనికివస్తాననుకోలేదు. ఆఫీసుల్లో నా వ్రాత అక్కర్లేదన్నారు — దానికి యంత్రాలే ఉన్నాయన్నారు. ఎక్కడా పనికిరానని తేలి ఈ ఉద్యోగంలో చేరాను. తీరా నాని ప్రారంభోత్సవం ఇలా మొదలైంది. ఏనాడో ప్రారంభోత్సవం ఋతువు అయిపోతుంది. తర్వాత!

సందో గాదా భవిష్యతి!

నాకు ప్రారంభోత్సవదశ వదలలేదన డానికీ, ఆ ప్రారంభకష్టాలు వదలలేదనడానికీ నిదర్శనంగా తర్వాత తర్వాత అనేక సంఘ టనలు జరిగాయి.

ఒకసారి —

ఒక ఊళ్ళో — ఆ ఊళ్ళో పోలీసు బలగం చాలా ఉంది — ఒకనాటి ఉదయం, తమ బలగంలో కొంతమందిని ఎవ్వరో ఫలానా చోట ఎత్తుకొనిపోయినట్టు అధికారులకు వార్త వచ్చింది. అంతే! నానాఖంగారూ పడ్డారు. ఆఖంగారు నాకళ్ళపడింది. లారీల్లో పోలీసుల్ని అడ్డమైన ఆయుధాలతో ఎక్కించి ఫలానా చోటుకు పంపించేస్తున్నారు. ఆతర్వాత ఏమి జరిగిందో నాకు తెలియదు గానీ, ఇలా కొందరు పోలీసుల్ని ఫలానా చోట ఎవ్వరో ఎత్తుకునిపోయినట్లు విలేఖ రించాను.

ఆమర్నాడు —

పోలీసు అధికారి 'ఆవార్త సరికాదు' అని ఒక సవరణ పంపమన్నాడు. "పంపు తాను — సవరణకు ఒక వివరణ సెలవిస్తే" అన్నాను. "ఏముంది — తీరా మావాళ్ళని ఎవళ్ళూ ఎత్తుకుపోలేదని తెలుసుకున్నాము; అందరం అక్కడికిపోయి గాలించి పాగేశాము. ఎవళ్ళనీ ఎవళ్ళూ ఎత్తుకు పోలేదు. ఇలా ఒక సవరణపంపండి" అని చెప్పాడు.

జి. కృష్ణ

"ఎంతమందివెళ్లారు ఈ గాలింపుకోసం?" అని అడిగాను.

"అందరమూ" అన్నాడు.

అయితే ఇది మంచి రసవత్తరమైన కథే అనుకున్నాను, గజంమిథ్య- పలాయనం మిథ్య—

ఆ అధికారి తీరా వినుకున్నాడో— "బాబోయ్—సవరణవద్దు—వివరణా వద్దు— ఇది చాలు. ఇక్కడితో ఆగండి!" అన్నాడు.

అంతే నే పంపినవార్తకు సవరణగానీ సంస్కారంగానీ లేకుండా పోయింది. ఆ వార్తను అబద్ధమన్నా కాదే—నిజమన్నా కాదే—

విలేఖరి ఉన్నదిఉన్నట్లు వ్రాయాలని ఒక చదువుకున్నాయన నాకు నూరిపోశాడు, ఒకసారి. ఆయన ఒక కులసంఘానికి కార్యదర్శి. విలేఖరి వింటూఉండాలి—చూస్తూ ఉండాలి—అంటే కళ్లూ చెవులూ అప్పగించి. అంతే చేశాను. నాకు తాను గురువులాంటివాడినని చెప్పుకున్నాడు, విన్నాను. నిజమే, ఆయన నాకు "సత్యం విద్య" ఉపదేశించాడు.

కొన్నాళ్ళకు వాళ్ళకులం సభజరిగింది. 'విలేఖరించడానికి' వెళ్ళాను. "జాతిపితకు వందనము లాచరించి" అని వారి మొదటి తీర్మానంలో ఒకమాట వచ్చింది. అమాంతం ఒకరులేచి "ఆయన మనజాతిపిత కాడు" అన్నాడు. జాతివేరూ, కులంవేరూ అని కార్యదర్శి నచ్చచెప్ప జూశాడు, కుదరలేదు. గంటసేపు రభస జరిగింది. సభ అయిపోయింది.

నేను ఏమి విలేఖరించాలి? పైగా ఆ కార్యదర్శి నాకు "సత్యం విద్య" నేర్పిన వాడుకూడాను!

నేను ఏమీ వ్రాయనేలేదు.

ఆయన సంతోషించాడు-సత్యం వ్రాయనందుకు!

విలేఖరిగా ఎక్కడికైనాపోతే - ఆమాట కొస్తే విలేఖరి 24 గంటలూ విలేఖరే-"ఇదిగో! ఈ విషయం రాసేసుకో!" అని కొందరు అదలిస్తూ ఉంటారు - విలేఖరికి వేరే పనేముంది గనక!

అలా వ్రాయని సంగతులు అనేకం ఉంటాయి, ముచ్చటైనవి.

ఈమధ్య ఒక విదేశీయుని ఇంటికి విందుకు వెళ్ళాను. విందులో పత్రికా ప్రతినిధులు, ఆ 'గెస్టు,' ఆయన భార్య - వెరసి 13 మంది అయ్యారు! చాలా చెడుసంఖ్య. జంటలు జంటలుగా పడి మాట్లాడేసుకుంటున్నారు - నేను ఒక్కణ్ణే వేరోడుగా మిగిలిపోయాను. ఆ గదినిచూస్తూ కాలక్షేపం చేయసాగాను- జంటలు మాట్లాడుతుంటే పుట్టే రణగొణ ధ్వనిలో, నిశ్శబ్దంగా.

ఆ గెస్టు ఇంటిలో బోలెడు పుస్తకాలు, నేను చదివినవీ, చదవనివీ, పేర్లు విన్నవీ, విననివీ ఉన్నాయి. 'ఆదం' బొమ్మ ఒకటి ఉంది - బొమ్మలవరకూ మాత్రమే వేసిన చిత్రం. బహుశ జీవుడా!—ఈ 'ఆదం' కు బొడ్డులేదనుకున్నాను. ఆదంకు బొడ్డు ఉందా లేదా అని పాశ్చాత్య మతవిజ్ఞానులు చిరకాలంగా తర్జన భర్జన చేస్తున్నారు. అది ఇంకా తేలనేలేదు.

ఆ గెస్టును అమాంతం కదలేసి, "ఈ ఆదంకు బొడ్డులేదు!" అన్నాను. అతగాడికి అర్థం కాలేదు.

"అంటే?" అన్నాడు. నేను ఇంకేమీ అనలేదు.

ఈలోగా ఆ గెస్టూ మరొకరూ మాట్లాడుతున్నారు. నేనూ ఈలోగా మరో చిత్రం వైపు చూపులు వదిలాను. ఆ చిత్రం 'ఇద్దరి గుసగుసలు!" ఇద్దరివీ బట్టతలలే — మధ్య డొంక-ఇటూ అటూ మసిపట్టినట్లోయి గడ్డల్లాగా జుట్టు. ఎంత తీక్షణమైన రహస్యాలోగానీ, వాళ్ళ (ఒకపక్క) కనుబొమలు ఆ పాయిగడ్డల్లోకి జాలాల్లాగా పొడుచుకుపోతున్నాయి. ఒకడి మూతి వంకర తిరిగింది. మరొకని మూతి ముడుచుకునిపోయింది. భలేగాగుంది. రహస్యం రగిలిపోతోంది!

"అది బాగుంది!" అని మళ్ళీ గెస్టును కదలేద్దామనుకుంటూ ఉండగా, ఆ గెస్టుతో ఒక విలేఖరి ఇలా మాట్లాడుతున్నాడు—

విలేఖరి : డా|| రాధాకృష్ణన్‌కు వేదాంతం ఏమీరాదు; మీకు తెలియదు ఆ సంగతి.

గెస్టు : అరె—అట్లాగా!

విలేఖరి:రాధాకృష్ణన్‌కు పేరువచ్చింది— అంతే—అదో అదృష్టం-గాంధీ, నెహ్రూ, అలా చేశారులెండి. మీకు ఎలా తెలుస్తుంది ఆ సంగతి?

గెస్టు : అరె—అదేమిటి! తమాషాగా ఉంది— (అని ఏదో చెప్పబోతుండగా)

విలేఖరి : రాధాకృష్ణన్‌కు మా తాతయ్య వేదాంతం నేర్పాడు. మా తాతయ్య పెద్ద పండితుడులెండి.

గెస్టు : మీ తాతయ్యపేరు?

నాకు నవ్వొచ్చింది. నవ్వాను. ఆ గెస్టు నావంక తిరిగి, "క్షమించాలి-మీతో ఎక్కువగా మాట్లాడడంలేదు!"

నేను : ఫరవాలేదు-ఆ గుసగుసల బొమ్మ బాగుంది.

గెస్టు : మీరు బొమ్మలూ, పుస్తకాలూ చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు, మాట్లాడకుండా!

నేను : ఇక్కడ సరి సంఖ్య లేదు. అదీ పేచీ. లేకపోతే మాట్లాడడానికేముంది— వింటున్నాను.

గెస్టు : మీకు ఆ గుసగుసలబొమ్మ ఇవ్వాలని ఉంది-తీసుకుంటారా? తీసుకోండి. అది గాంధీజీ 'కోతులు' వంటిది కాదు-అంత మంచిదికాదు కానీ-మీరు వినడానికి, చూడడానికి మాత్రమే పుట్టినట్లుంది-తప్పక తీసుకోవాలి.

ఇక నేను ఆ బొమ్మనుచూసి ఏదో తత్వం కల్పించుకోవడం ప్రారంభించుకోవాలి— జీవితం అంతా ప్రారంభోత్సవాలేకదూ—

నా కా బొమ్మ వద్దన్నాను. అసలు రహస్యం ఆ 'ఇద్దరి గుసగుసలు' నాకెలా అర్థమవుతాయి? అర్థమయ్యేదాకా తిరగాలి, వృత్తిధర్మాన్ననుసరించి. జీవితంలో ప్రారంభోత్సవమే పూర్తికాలేదు - రహస్యాలు తెలుసుకునే వ్యక్తికి ఎలాసాధ్యం? ★




జామ్-బక్
పుండు బాధిత
పాదములను త్వరలో
శమన పర్చును
అమూల్య సుగుణములన్నిటితో గూడిన జామ్-బక్, ప్రపంచంలో కల్లా అత్యుత్తమ చర్మ అయింట్‌మెంట్. జామ్-బక్ చర్మ రంధ్రములలోనికిపోయి, బాధిత పాద కండరములను శమన పర్చును మరియు వాపును నిరోధించును


జామ్-బక్ ఇతర చర్మ వ్యాధులన్నిటికిన్ని గాయములకు కూడ అద్భుత నివారిణి.
అంత ప్రాప్య లేదో లంపరేదని గ్యారంటీ చేయబడినది.
అన్ని మందుల షాపులందునూ దొరకును.
సోల్ ఏజెంట్లు : దాదా & కంపెనీ,
86, సైనప్ప నాయకన్ వీధి, మద్రాసు.



# శరీర మర్మ శాస్త్రము
చిత్రపటములతో వెల రూ. 3/- "దాంపత్య రహస్యములు" పటములతో 284 పేజీలతో పటములతో వెల రు. 2/- "కామకళ లేక కొక్కోకము" పటములతో వెల రూ. 1/- పోస్టేజివేరు.
D. S. మిత్రా & కో, 26 (Beat) వీధి—
సౌకారుపేట, మద్రాసు. 1